క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని కటికపల్లిలో ఇటీవల మృతి చెందిన పంచాయతీ మాజీ సిబ్బంది ఎంట్ల యాదయ్య కుటుంబానికి మంగళవారం మాజీ సర్పంచ్ బుడ్డోళ్ల నరేందర్‌గౌడ్ రూ.12వేల ఆర్థికసాయం అందించారు. అన్ని విధాలా అండగా ఉంటానని ఆ కుటుంబానికి భరోసా కల్పించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది చిట్టి బాలకృష్ణ, మేకం శివ, ఎంట్ల పద్మమ్మ, బర్ల పోచయ్య పాల్గొన్నారు.

సీసీరోడ్లు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30, 31, 32 డివిజన్‌లలో సీసీరోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావడంతో మంగళవారం మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. అన్ని డివిజన్‌లలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు మేయర్ వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భీమిడి స్వప్నజంగారెడ్డి, కాలనీవాసులు శ్రవణ్‌కుమార్, శ్యాం సుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలనీల మహిళలు ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి

కందుకూరు: ప్రభుత్వ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ, లింక్ వర్కర్స్ ప్రాజెక్టు ద్వారా ఆ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ టి.రాంరెడ్డి మంగళవారం మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్ఐవీతో పాటు క్షయ వ్యాధిపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవీపై 9, 10 తరగతుల విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ అనేది వైరస్‌తో వస్తుందని, లైంగిక సంబంధాలతో ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కమ్మగూడలోని 22వ వార్డు, ప్రగతి నగర్ ఫేజ్2 కాలనీ వాసులు మంగళవారం కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. తమ కాలనీలో అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మస్కతి డెయిరీ, ఎస్‌వీఆర్ కంపెనీ నుంచి వెలువడే పొగ, ధ్వని కాలుష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కమిషనర్ దృష్టికి తెచ్చారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ఆర్. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులు ఒకచోట.. రికార్డులు మరోచోట

ఏనిమిదేళ్లు గడిచినా పాత కార్యాలయంలోనే
- కందుకూరు మండలానికి తెప్పించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



ఇదే కందుకూరు ఆర్డీఓ కార్యాలయం

కందుకూరు: కందుకూరులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటై ఏనిమిదేళ్లు పూర్తయ్యింది. ఇంత వరకు ఇక్కడికి పూర్తిస్థాయిలో రికార్డులను మాత్రం తరలించలేదు. పాత రికార్డులు అవసరమున్న వారు నిత్యం కార్యాలయాల చుట్టూ చెక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి నెలకొందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత భవనంలోనే...

గతంలో మహేశ్వరం, కందుకూరు, సరూర్‌నగర్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నానికి చెందిన మండలాలు కూడా సరూర్‌నగర్ ఆర్డీఓ కార్యాలయ పరిధిలో ఉండేవి. సరూర్‌నగర్ కార్యాలయం సైతం నాంపల్లి పరిధిలోని మొజాంజాహీ మార్కెట్ సమీపంలోని కట్టెల మండి ప్రాంతంలోని ప్రభుత్వ భవనంలో కొనసాగేది. 2016లో కొత్తగా మండలాలు, డివిజన్లు ఏర్పాటు చేసే క్రమంలో కందుకూరును ఆర్డీఓ డివిజన్‌గా ప్రకటించారు. గతంలో సరూర్‌నగర్ ఆర్డీఓ క్రింద ఉన్న కందుకూరు, మహేశ్వరం, సరూర్‌నగర్ మండలాలతో పాటు కొత్తగా ఏర్పాటైన బాలాపూర్, మహబూబ్‌నగర్ ఆర్డీఓ పరిధి, కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్ మండలాన్ని కందుకూరు పరిధి కిందకు చేర్చారు. 2016లో అక్టోబర్ 11వ తేదీన కందుకూరు మండల కార్యాలయ ఆవరణలోని అతిథి గృహంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి అక్కడే కొనసాగుతుంది. తర్వాత కాలంలో రికార్డులు భద్రపరచడానికి ఆ భవనంపైన అదనపు నిర్మాణాలను సైతం చేపట్టారు. తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు మండలాలకు చెందిన అన్ని రికార్డులను ఇక్కడికి తరలించారు. కానీ కందుకూరు, మహేశ్వరం, సరూర్‌నగర్, బాలాపూర్ మండలాలకు చెందిన రికార్డులను ఇంత వరకూ ఇక్కడికి చేర్చలేదు. 2016 అక్టోబర్ 11 కంటే ముందు ఆర్డీఓ పరిధిలో జరిగిన లావాదేవీలకు సంబంధించిన ఏవైనా సర్టిఫైడ్ పత్రాలు, ఇతరత్రా భూములకు సంబంధించిన పేపర్లు, బర్త్, డెత్ తదితర సర్టిఫికెట్ అవసరమైతే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తూందని సంబంధికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అవి అన్నీ నాంపల్లిలోని కట్టెలమండి పాత కార్యాలయంలోనే ఉన్నాయి. ఏమైన రికార్డులు అవసరమైతే సంబంధిత సిబ్బంది వారంలో ఒక్కరోజు అక్కడికి వెళ్లి తీసుకురావల్సి వస్తుంది. అవి ఒక్కోసారి దొరకడం లేదు. ఒక గ్రామం, లేదా మండల పత్రాలు మరోదాంట్లో కలిపేయడం లేదా సర్టిఫైడ్ పత్రాలు ఇచ్చే క్రమంలో జిరాక్స్ తీసి మళ్లీ అసలైన ప్రదేశంలో పెట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా మంది తమతమ సర్టిఫైడ్ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుని నిత్యం వాటి కోసం ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి అన్ని రికార్డులను కందుకూరు కార్యాలయానికి చేరవేసేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమయం వృథా



కందుకూరు, మహేశ్వరం, సరూర్‌నగర్, బాలాపూర్ మండలాలకు సంబంధించిన రికార్డులు అన్ని నాంపల్లి పరిధిలోని పాత కార్యాలయంలోనే ఉన్నాయి. దీంతో సర్టిఫైడ్ పత్రాలు ఏవైనా అవసరమైతే లబ్ధిదారులకు ఇబ్బందిగా మారుతుంది. సమయం వృథా అవుతుంది. దరఖాస్తు చేసిన తర్వాత చాలా రోజులకు కాని అందడం లేదు. కొన్ని సార్లు దొరకడం లేదు. అన్ని రికార్డులు ఇక్కడికే తరలిస్తే బాగుంటుంది.

– ఎస్ సురేందర్‌రెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

అన్ని రికార్డులు తెప్పించాలి



బాలాపూర్ మండల రికార్డులు అన్నీ పాత కార్యాలయంలోనే ఉన్నాయి. దీంతో సర్టిఫైడ్ కాపీలు అవసరమైతే వాటిని తెప్పించడానికి 15 రోజులకు పైనే పడుతుంది. అవి వచ్చే వరకు నిరీక్షించాల్సిందే. చాలా ఇబ్బందిగా ఉంది. ఆర్డీఓ పరిధిలోని అన్ని మండలాల రికార్డులు ఇక్కడికే తెప్పించాలి.

శంషోద్దీన్, కౌన్సిలర్, జల్‌పల్లి మున్సిపాలిటీ

మోడల్ స్కూల్‌కు నిధులు మంజూరు

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలో గల మోడల్ స్కూల్‌లో అదనపు గది నిర్మాణంతో పాటు భవనాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఖలీముద్దీన్ తెలిపారు. మంగళవారం ఎంఈఓ నర్సింహతో కలిసి మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన గది నిర్మాణానికి పీఎంశ్రీ పథకం కింద రూ.13.50 లక్షలు, మరమ్మతుల కోసం రూ.4.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద మరో రూ.8 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌తో చర్చించారు. అనంతరం ఎంఈఓ నర్సింహ మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేసి పెట్టాలని, మెనూ ప్రకారం వంట చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, ఏఈ శ్రీనివాస్, సీఆర్పీ వెంకటేశ్, సహాయక ఇంజినీర్లు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఇంజనీర్లు, ఎంఈఓ

విద్యార్థులను ప్రోత్సహించాలి

- నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు దశరథం
- ఎంబీబీఎస్ సాధించిన సాయినాథ్‌కు సత్కారం



విద్యార్థి సాయినాథ్‌ను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణ సేవాసంఘం నాయకులు

ఆమనగల్లు: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలని నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం, మండలశాఖ గౌరవ అధ్యక్షుడు పెరికేటి యాదయ్యలు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన ఊర్మిళ, రాధాకృష్ణమూర్తి దంపతుల కుమారుడు సాయినాథ్ నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ నేపథ్యంలో పట్టణంలో విద్యార్థి సాయినాథ్‌ను, తల్లిదండ్రులు ఊర్మిళ, రాధాకృష్ణమూర్తిలను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా కానుగుల దశరథం, పెరికేటి యాదయ్యలు మాట్లాడారు. విద్యార్థులకు సరైన ప్రోత్సాహం ఇస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు కానుగుల గణేశ్, పట్టణ అధ్యక్షుడు రమేశ్, జంపుల యాదగిరి, బాలు, రామచంద్రయ్య, రాజు, సురేశ్, అదివయ్య, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ రవీందర్‌రెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా రూ.17.50 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులను మంగళవారం పంచాయితీరాజ్‌శాఖ ఈఈ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ రవీందర్‌లు పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రిభవనం జాతీయ రహదారి కంటే ఎత్తు తక్కువలో నిర్మిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలనుసారం వారు పనులను పరిశీలించారు. జాతీయ రహదారికంటే రెండుఫీట్ల ఎత్తులో బేస్‌మెంట్ నిర్మించి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ పనులను ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈఈ రవీందర్‌లు పరిశీలించారు. ప్రస్తుతం స్లాబ్ నిర్మాణానికి వేసిన సెంట్రింగ్‌ను తొలగించి బేస్‌మెంట్ ఎత్తును పెంచి స్లాబు వేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ బాల్‌రెడ్డి, స్థానిక నాయకులు మెకానిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కందుకూరు: సీపీఎం బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు దుబ్బాక రాంచందర్, మండల కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని దెబ్బడగూడలో ఆ పార్టీ మహాసభను నిర్వహించారు. పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా రావిచెట్టు చందును ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన పార్టీ నిలబడి పోరాడుతోందన్నారు. వారికి అవసరమైన ఇళ్ల స్థలాలు, శ్మశానవాటికలు తదితర సమస్యలను పార్టీ తరఫున పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సాతిరి సుధాకర్, బర్కం ప్రభాకర్, సాతిరి విజయలక్ష్మి, మండల రాములు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చైర్‌పర్సన్ బరిగెల హేమలత



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్లతో సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతీ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణం, తాగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్యానికి నిధులు కేటాయించామన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈఈ యాదయ్య, వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

సీపీఎం మండల కమిటీ సభ్యుడు విఘ్నేష్

ఇబ్రహీంపట్నం రూరల్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కమిటీ నాయకుడు పల్లపు విఘ్నేష్ పేర్కొన్నారు. కప్పపహాడ్ గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్, జంగిలి దాసు, జంగిలి అనితలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి సహకారంతో వెంకటేష్‌కు రూ.51వేలు, జంగిలి దాసుకు రూ.15,500, అనితకు రూ.18వేలు మంజూరైన చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి జంగిలి ప్రభుదాసు, శాఖ కార్యదర్శులు రాజశేఖర్, సీహెచ్ సురేష్, గుడాల భిక్షపతి, మాజీ వార్డు సభ్యులు ఇందిర, గోపి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ రాఘవేందర్

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మేకను బలిచ్చిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని భజరంగ్‌దళ్ మహేశ్వరం జిల్లా కన్వీనర్ ఎర్ర రాఘవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చనతో పాటు పలు పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయం వందల సంవత్సరాల చరిత్ర కలిగి స్వయంభు వెలసిందన్నారు. హిందువులు ఎంతో పవిత్రంగా కొలిచే హనుమాన్ ఆలయ ఆవరణలో అన్యమతస్తుడు మేకను బలిచ్చి ఆలయాన్ని అపవిత్రం చేశారన్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై అతన్యమతస్తులు కుట్రపూరితంగా దాడులకు తెగబడి మనోభావాలను దెబ్బతిస్తున్నారన్నారు. హిందువుల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఇప్పటికైనా ఆలయ ప్రాంగణంలో మేకను బలిచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో హిందువులు, ఆలయాల జోలికి వస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అంతకుముందు ఆలయంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మహేశ్వరం జిల్లా కార్యదర్శి మండల రాజు, ఉపాధ్యక్షులు సిద్ధు, గంగపురం శివకుమార్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవేందర్

ఆలయాలపై దాడులు సరికాదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: హిందువుల మనోభావాలను దెబ్బతిసే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో బీజేపీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందువుల ఆలయాలపై అన్యమతస్తులు దాడులు చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. గత పదిరోజుల క్రితం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, నేడు ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో అన్యమతస్తులు కుట్రపూరితంగా వ్యవహరించి దాడులు చేయడం హేయమైందన్నారు. ఘట్టుపల్లి ఆలయ ఆవరణలో అన్యమతస్తుడు మేకను బలివ్వడంతో ఆలయం అపవిత్రమైందన్నారు. ఈ సంఘటనపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు స్పందించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. అంతకుముందు ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్యగౌడ్, కదారి జంగయ్య యాదవ్, సుదర్శన్‌రెడ్డి, అనంతయ్యగౌడ్, దేవేందర్‌రెడ్డి, యాదిశ్, వెంకటేశ్, మాధవచారి పలువురు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సురేష్‌కుమార్

యాచారం: మానవ అక్రమ రవాణాలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిర్మూలనపై మంగళవారం యాచారంలో అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుందని, దీన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులకు కలిగే ఇబ్బందులపై చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ తులసి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయండి

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్



న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్‌తో పోతుగంటి అశోక్ తదితరులు

కడ్తాల్: మండల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీల్లోని 18 నుంచి 35 సంవత్సరాలలోపు మహిళలందరికీ కుట్టుమిషన్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్యతో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్యతో అశోక్ మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో మొదటి విడతగా కడ్తాల్ మండల కేంద్రంతో పాటు వంపూగూడ, చల్లంపల్లి, అన్మాస్‌పల్లి, కర్కల్‌పహాడ్ గ్రామాల్లోని దళిత మహిళలకు కుట్టుమిషన్ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అంజయ్య హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ వసంత, మురళీధర్ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు యాదయ్యను సత్కరిస్తున్న మహేశ్

ఆమనగల్లు: పట్టణానికి చెందిన జంతుక యాదయ్య ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎంపికై ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. ఈ నేపథ్యంలో నూతన ఉపాధ్యాయుడిని అంబేడ్కర్ యువజనసంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ఘనంగా సన్మానించారు. యువజన సంఘం సభ్యులు బాలరాజు, శ్రీశైలం, కృష్ణ, అశోక్, మహేశ్, గిరి, కృష్ణ, మల్లేశ్, శేఖర్, శంకర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



పనులకు శంకుస్థాపన చేస్తున్న జయశ్రీ

మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు పేర్కొన్నారు. 8వ వార్డులోని పోలీస్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పురప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్లు వడ్డేపల్లి విద్యావిజేందర్ రెడ్డి, పసుల రాజేందర్, సిద్దంకి కృష్ణారెడ్డి, డీఈ శివానందం తదితరులు పాల్గొన్నారు.